# 'ఏం చేసినా ఒకటే'

"ఇంటికెళ్ళి యేం చెయ్యను?" అనుకున్నాడు రంగారావు. కాని యింటికెళ్లకండా చెయ్యగల ప్రయోజనకరమైన పనీ లేదు.

రంగారావే కాదు, సాధరణంగా మనలో చాలామందికి అడపా దడపా యిట్లాంటి ప్రశ్నే వుదయిస్తూంటుంది. అయితే దానికి తకీమని సమాధానం యేమీ దొరక్కపోయినా దగ్గరలో వున్న యే పార్కుకో వెళ్ళి వొంటరిగా బెంచి మీద కూలబడతాము. రంగారావు మాత్రం అంతకన్నా యెక్కువేం చెయ్యగలడు?

------- రేడియో సంగీతం పాడుతోంది. పక్షులు కిల కిల లాడుతూ పార్కు లో చెట్ల మీదికి చేరుకుంటున్నాయి. ఆకాశం నిర్మలంగా లేదు, ఏ అర్ధరాత్రికో పైరులు పాడు చెయ్యగల వాన రావచ్చు. మొత్తం మీద వాతావరణంప్రోత్సాహజనకంగా లేదు. సంగీతం ఆగి పోయింది.

చేతిలో తలవాల్చుకుని వున్నవాడల్లా రంగారావు హటాత్తుగా సంగీత కెరటాలు ఆగిపోయిన వేపు చూచాడు. ఏమిటీ తమాషా! తన మనస్సు యింతసేపూ సంగీతం వింటోందా? తన దుగ్ధ యావత్తూ పునఃప్రతిష్ఠమై కూర్చుంది.

తన సీనియారిటీని యెగర్తించి, ఆఫీసు కాగితాల ముక్కూముఖమూ తెలీకండా ఎల్లప్పుడూ గోల్డుఫ్లాకు సిగరెట్లతో చుట్టుపక్కల వాళ్ళని తన్మయుల్ని చేస్తో అతి షోకిల్లాగా కాలం వెళ్ళబుచ్చే జగన్నాధరావుకు యెక్కడ సెలక్షను గ్రేడు యిచ్చేసి వూరుకుంటారోనని భయం. మాటలా మరి! హోదాలోనే కాకండా ఆర్థికంగా గూడాఎంతో ముందడుగు.

5)



ఒకవేళ అట్లాంటి దుస్సంఘట్టనే సంప్రాప్తం అయినా తను చెయ్యగలిగిందేమీ లేదు, ఉస్సురని నిట్టూర్చి చేతనయినన్నాళ్ళూ యేడుస్తూ ఉండటం తప్ప!

చేయగలిగిందల్లా విశాలప్రపంచంలో జరుగుతున్నదంతా కళ్ళారాచూస్తూ కూచోటమే! ఏ విషయంమీద గానీ తోచిన ముక్కలు రెండు అనటానికి లేదు. "నోరా, వీపుకి దెబ్బలు తేకే" అన్న సామెతగా స్తంభించిపోవాలి. ఏమిటి మరి భావ స్వాతంత్ర్యం? జీవితాల్లో యేది ఉత్తమ స్థానం పొందుతోంది? భావమా? పరిస్థితులా? పొద్దుల్లో కూర్చున్న వాడు యెందుకు కూర్చున్నట్టు? అట్లా కూర్చుందామని భావం ప్రేరేపించిందా లేక పరిస్థితులు ప్రభవించినాయా?---- ఏమిటి తన మనస్సు తర్కంలోకీ మీమాంసలోకీ దిగుతోంది? ఈ ఫిలాసఫీ అంతా ఆలోచించి బుర్ర చెడగొట్టుకోటం యెందుకు?

తనకేం కావాలి? జీవితంలో ఒకస్థానం. ఆపథంలో తు, చ తప్పకుండా నడుచుకొంటున్న తనకి యీ అవాంతరాలన్నీ వచ్చి యెందుకు గందరగోళం పెడుతున్నాయి? మరొకరి ప్రమేయం లేకుండా సాఫీగా నడచి పోయే జీవితమూ మరొకరికి బాధలేకుండా ప్రశాంతంగా గడచిపోయే ఘడియలు కావాలి తనకు. ఆ వేదనలన్నీ చల్లారిపోయి ఆందోళనలన్నీ విరిగిపోయి చల్లగా చలవగా రోజులెప్పుడు అవతరిస్తాయి?

చీకటి పడిపోతోంది. ఏడుగంటలు దాటాక యింటికి వెళ్తే సరళ ముఖం చిట్లించుకుంటుంది. సంసారం యేమన్నా సజావుగా నడవాలన్నా తనమూలంగా ఛిద్రాలేవీ సృష్టికాకుండా వుండాలన్నా సరళ యిష్ట ప్రకారం నడచుకోవటంకన్నా మార్గంలేదు. కాని ఎందుకు సరళ కంత చిట్లింపు? ఏకటాకీని పదిగంటలకు తక్కువ కాకుండా నిద్రపోదామన్న దురాశకు కారణం ఏమిటి? కాని "మీకేం? యిట్లాంటి శ్రీరంగనీతులు యెన్నయినా చెబుతారు. పగలల్లా నిమిషం తీరిక లేకుండా యింట్లో చాకిరి చెయ్యటం కాకుండా రాత్రిళ్ళు నిద్రకూడా లేకపోతే యెలాగు? ఐనా అయిదింటికి ఆఫీసు మూసేస్తారుకదా. నేరుగా యింటికి వచ్చెయ్యకూడదండీ?" అంటుంది. ఏం తెలుసు పగలల్లా తను అక్కడచేసే చాకిరీ? ఇంటి దగ్గర తను చేస్తున్నదంటే యెవరికోసం?---- తనకోసం తన సంసారంకోసం! కాని తన మాటేమిటి?---- తగినంత ప్రతిఫలం ఆశించకుండా యెవడికో లాభాలు సంపాయించి పెట్టటమేగా తను ఆ చీకటి గదిలో కూచుని చేసేపని. ఎవరితో చెప్పుకుంటాడు యీ సోదంతా?

"అబ్బ, మీకు రాత్రి నిద్ర రాదండీ! ఆఫీసులో పగలల్లా నిద్ర పోతారా యేమిటి?" అనడుగుతుంది సరళ. తన మనస్సులోని ఆలోచనలూ ఆందోళనలూ యేం తెలుతాడు భార్యకు? చెప్పి మాత్రం ప్రయోజనం యేమిటి?

ఒక్కొక్కప్పుడు చెప్పరాని ఆవేశం కలుగుతుంది. తిరుగుబాటు చేదామనుకుంటాడు. కాని యెవరి మీద? ఏరీతిగా? చప్పున అణగి పోతుంది ఆవేశం. తొందర పడ్డందుకు మనసు కదలబారుతుంది.

వికా వికలమైన మనస్సును దగ్గరకిచేర్చి మళ్ళీ ఆకారం చేకూర్చేటప్పటికి పుణ్యకాలం కాస్తా పూర్తయిపోతుంది. జీవితంలో యెన్ని పరీక్షలు! చదువుకునే రోజుల్లో చెప్ప నే అక్కరలేదు. తరవాత ఉద్యోగానికి ఒక పరీక్ష, ఉద్యోగంలో ప్రమోషన్లకు పరీక్షలు, వివాహం ఒక పరీక్ష, వైవాహిక జీవితంలో ప్రతిక్షణం పరీక్ష; ఇల్లాంటి పరిస్థితుల్లో ఆదుర్దాలు చంపుకోటం యెట్లా సాధ్యం?

రంగారావు తీరిగ్గా నడుస్తూ యిల్లు చేరుకునే లోపున "నేనెక్కడవున్నా ఒకటే, యేం చేసినా ఒకటే జరిగేది - జరక్కమానదు!" అనుకున్నాడు. కాని నిరాశ ఆ మనస్సును జయించిందనీ, దాన్ని జయించేందుకు యెంతో ఆత్మగత విప్లవం రావాలనీ రంగారావుకు తోచదు. తోచినా అదెట్లా సాధ్యం అవుతుంది? ❋

*(తెలుగు స్వతంత్ర)*